# "అత్యాశ మతిహాని, మిత ఆశ అతిహాయి"

తామరాకుపై తళతళలాడే
నీటిబొట్టువలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు పొరల కొంపరా
దిగులు దుఃఖముల తెరరా లోకము
హరిగోవిందా హరిగోవిందా
హరిగోవిందా అనరా మందా
మృత్యువు దాపున మసలేటప్పుడు
ధనము చదువు కాపాడవురా
హరిగోవిందా హరి గోవిందా
హరిగోవిందా అనరా మందా

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా!

బ్రతుకు చాలా చంచలమైనటువంటిది. ఇందులో బాధలు రోగములు అనంతము. ప్రపంచము ఆకర్షణీయముగా గోచరించుచున్నదేగాని యిది దుఃఖాలయము. జీవితము తామరాకుపై నీటి బుడగవంటిది. తామరపువ్వు నీటియందే పుట్టి నీటియందే నిలచి నీటియందే జీవించుచున్నది. కమలమునకు నీరే ఆధారము. నీరే ప్రమాణము.

## సమస్త దుఃఖములకు అజ్ఞానమే మూలకారణం

'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' యిదే నిజమైన సరోవరము. ఇది దివ్యమైన ఆత్మయొక్క సరస్సు. దీనియందే సూక్ష్మస్వరూపమైన కమలము ఆవిర్భవిస్తుంది. భావములు, సంకల్పములే దీనియొక్క పవిత్రమైన సుగంధములు. మాయనే యిందులోని తామరాకు. ఈ ఆకుపై జీవించుచున్నదే జీవితమనే నీటిబుడగ.

sri sathyasai vachanamrutam

**నీటియందె పుట్టి నీటియందె పెరిగి**
**నీటియందడంగు నీటిబుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**
**ఉన్నమాట తెలుపుచున్న మాట**

సమస్త సృష్టిలయములకుకూడ ఆత్మతత్త్వమే ఆధారము. అదితప్ప యీ జగత్తులో అన్యము మనకు గోచరము కాదు. అయితే మానవుడు లౌకికమైన, భౌతికమైన జీవితము నిమిత్తమై అశాశ్వతమైన నీటి బుడగవంటి దేహము నాశ్రయించి యిదే సత్యము, నిత్యమని భ్రమించి తాను కొంత దుఃఖమునకు గురౌతున్నాడు. సమస్త దుఃఖములకు యీ అజ్ఞానమే కారణం. తనను తాను గుర్తించుకున్నప్పుడు యిట్టి అజ్ఞానమునకు, దుఃఖమునకు యెట్టి అవకాశము ఉండదు. కనుకనే బుద్ధుడు కూడా

**సర్వమ్ దుఃఖం దుఃఖం**
**సర్వమ్ క్షణికం క్షణికం**
**సర్వమ్ శూన్యం శూన్యం**

అని చాటుతూ వచ్చాడు.

**మానవుని నిజస్వరూపమును గుర్తించటమే విద్యయొక్క లక్ష్యము**

మానవునియందు రెండు విధములైన తత్త్వములు యిమిడి ఉంటున్నవి. ఒకటి నిత్యము, మరొకటి అనిత్యము. ఒకటి ఆత్మ, మరొకటి అనాత్మ. ఒకటి శరీరము, మరొకటి శరీరి. ఒకటి దేహము, మరొకటి దేహి. ఒకటి క్షేత్రము, రెండవది క్షేత్రజ్ఞుడు. ఈ విధముగా ద్వైతముతో కూడిన మానవుడు విచారణ చేసి యేది సత్యము, యేది అసత్యము, యేది నిత్యము యేది అనిత్యము అని విచారణ చేసి సత్యాన్ని స్వీకరించి అసత్యాన్ని విసర్జించటం మానవుని ప్రధాన కర్తవ్యము. దీనినే భగవద్గీత క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము, గుణత్రయ విభాగయోగము, నిత్యానిత్య పరిశీలనా శక్తి అనే పదములచేత ప్రబోధిస్తూ వచ్చింది. మానవుని నిజస్వరూపాన్ని గుర్తించటమే విద్యయొక్క లక్ష్యము. ఇదే సరైన విద్య. లోకములో తమశక్తిని, తమ బుద్ధి, తమ సర్వస్వము

sri sathyasai vachanamrutam

త్యాగము గావించి, యోగమును అనుభవించి దివ్యత్వముతో చేరిపోవుటకు అనేక మార్గములు యేర్పడుతూ వచ్చాయి. 'నకర్మణా, నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః' అని త్యాగము మనకు ప్రధానమైన మార్గము.

మనము విసర్జించవలసినది యేమిటి, స్వీకరించవలసినది యేమిటి అన్న విచారణలో నిరంతరము సాగుతూ పోతుండాలి. మనకు కనుపించే యీ దృశ్యకల్పిత జగత్తునందు కన్పించే సమస్తపదార్థములు, ఆచరించే అనుభూతులను, అనుభవించే ఆనందాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈనాడు ప్రపంచము అనంతమైన అశాంతితో, కొన్ని విధములైన కష్ట దుః ఖములతో కుమిలిపోతున్నదని భావిస్తున్నాము. దీనికి కారణమేమిటని మనము విచారించాలి.

**మానవుని ప్రవర్తనలు, ఆలోచనలు సక్రమమైనవిగా ఉన్నప్పుడు జగత్తు సుక్షేమంగా ఉంటుంది**

మనిషి అనగా యేమిటి? మనిషి అనగా మనసే. మనసు అనగా యేమిటి? సంకల్పముల చేరికే. సంకల్పములనగా యేమిటి? ఈ పరిణామమే మన దైనందిన జీవితములో ఆచరించే ఆచరణ. ఈ ఆచరణఫలితమే మన నిత్యజీవితములో అనుభవించే సుఖదుఃఖములు. ఈ సుఖదుఃఖములకు కారణమేమిటి? మన ప్రవర్తనే. ప్రవర్తనకు కారణమేమిటి? మన యోచనలే. కనుక మానవుని ప్రవర్తనలు, ఆలోచనలు సక్రమముగా ఉండినప్పుడు జగత్తు సుక్షేమముగా ఉంటుంది. ఒక వృక్షమును గాని, ఒక నదినిగాని, ఒక పశువునుగాని దీర్ఘదృష్టితో విచారించినప్పుడు అవి యెంత త్యాగభూయిష్టమైన జీవితమును గడుపుతున్నాయో మనకు అర్థమవుతుంది.

**పరోపకారాయ ఫలంతివృక్షః పరోపకారాయ వహంతి నద్యః**
**పరోపకారాయ దుహంతి గావః పరోపకారార్థమిదం శరీరమ్**

పరోపకారనిమిత్తమై వృక్షములన్నికూడను ఫలములను యితరులకు అందించి తాము భుజించకుండా త్యాగమును జగత్తుకు అందిస్తున్నవి. తనయందు కావలసినన్ని ఫలములు ఉండినప్పటికిని ఒక్కఫలమునైనా వృక్షము ఆరగించదు. ఆ ఫలములను పక్షులకు, మానవులకు అందించి ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. పరోపకారార్థమై నదులు ప్రవహిస్తున్నాయి. నది తనలోని ఒక బిందువైనను తాను త్రాగదు. ఆజలమును పంటలు పండించేందుకు ఉపయోగించి,

జనుల దాహమును తీర్చి, అనేక విధములుగా పరోపకారార్థమై ఉపయోగించి ఆదర్శమును బోధిస్తున్నది. పరోపకారార్థమై గోవులు తమ రక్తమును క్షీరముగా మార్చి, పుష్టికరమైన ఆహారమును అందించి ఆదర్శమైన జీవితమును అందిస్తున్నవి. వృక్షములు, నదులు యీ విధమైన త్యాగమయమైన జీవితమునకు పూనుకొననియెడల మానవ జీవితము నిలువదు.

**పంచభూతములు అందించిన సంతోషమును, ఆనందమును అనుభవిస్తున్న మానవుడు ప్రతిఫలము నందించుట లేదు**

భగవంతుడు. "యెక్కడ ఉన్నాడు భగవంతుడు? ఎవరు భగవంతుడు?" అనే విచారణ చేసినప్పుడు ప్రకృతే భగవంతునిగా మనకు సాక్షాత్కరిస్తుంది. విద్యార్థులకు బాగా తెలిసిన విషయమే. భూమి గంటకు వేలమైళ్ల వేగముతో తన చుట్టూ తాను తిరుగుతుంటుంది. తన కర్తవ్యమును తాను శ్రద్ధతో చేస్తుంటుంది. ఒక్క క్షణమైనా తాను విశ్రాంతిని ఆశించదు. ఈవిధముగా భూమి తిరుగుటవలన రాత్రింబవళ్లు యేర్పడుతాయి. ఈలోకములో ఉన్న ప్రతిజీవికి ఒక కర్తవ్యాన్ని అందిస్తుంది. విశ్రాంతి నందిస్తుంది. తన చుట్టూ తాను తిరగటమే కాకుండా గంటకు అరవై ఆరువేల మైళ్ల వేగముతో సూర్యునిచుట్టూ తిరుగుతుంది. ఈ విధముగా తిరగటమువలన ఋతువులు ఏర్పడుతాయి. మేఘములు ఆవిర్భవిస్తున్నాయి. సూర్యచంద్రాదులు మానవునికి కర్తవ్యమును బోధిస్తున్నాయి. క్రియాశక్తి అత్యవసరమని బోధిస్తున్నాయి. ఈ విధముగా చూచినప్పుడు వృక్షములు, నదులు, పశువులు, భూమి మానవునకు గుణపాఠములను నేర్పిస్తున్నాయి. భూమికి యే మాత్రము స్వార్థము లేదు. తన కర్తవ్యము తాను చేయకపోతే తనకు వచ్చిన నష్టము యేమీ లేదు. మానవజీవితమే క్షీణించిపోతుంది. భూమి సూర్యునిచుట్టూ తిరగకపోయిన మానవజీవితమే శూన్యమైపోతుంది. పంచభూతములు యింత త్యాగము చేస్తుండగా మానవుడు యేవిధమైన త్యాగము చేస్తున్నాడు? పంచభూతములు అందించిన సంతోషమును, ఆనందమును అనుకూలములను అనుభవిస్తున్నాడు గాని మానవుడు ప్రతిఫలము నందించటం లేదు.

**మానవునకు అన్నింటికంటె ప్రధానమైనది కృతజ్ఞత**

మానవుని తెలివితేటలు పెరిగిపోతున్నవి. విజ్ఞాన ప్రజ్ఞానములు శీఘ్రముగా

sri sathyasai vachanamrutam

అధికమవుతున్నవి. కానీ, యివన్నీ కృత్రిమమైన విద్యలుగా రూపొందుతున్నవి. నిజమైన విద్యను మనము అర్థము చేసుకోటానికి ప్రయత్నించటం లేదు. మనము ప్రకృతిద్వారా అందుకున్నదానికి కృతజ్ఞత చూపే చర్యలేమీ చేయటంలేదు. మానవునకు అన్నింటికంటె ప్రధానమైనది కృతజ్ఞత. కృతజ్ఞత లేకపోతే మనము క్రూరమృగములకంటె హీనమైపోతాము. విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానములు లేని పశువులు, మృగములు తమ కృతజ్ఞతను యెన్నియో విధములుగా అందించుచుండగా సుజ్ఞాన, ప్రజ్ఞాన, విజ్ఞానములు కలిగిన మానవుడు తన కృతజ్ఞతను యేమాత్రము అందించలేక పోవుచున్నాడంటే యిది యెంతదురదృష్టము! అయితే, యిది కొంత విచక్షణా జ్ఞానముతో చేయవలసినపని. లేకపోతే ప్రమాదము. అపకారికి ఉపకారము చేస్తే అది మహా అపకారంగానే తోస్తుంది. హిస్టరీ చదివే పిల్లలకు చక్కగా తెలుసు. ఘోరీ మహమ్మద్ పృధ్వీరాజుపైన 17 పర్యాయములు దండెత్తి వచ్చాడు. ప్రతి పర్యాయము ఓడిపోవటము, పృధ్వీరాజు దయతలచి విడిచిపెట్టటము జరుగుతూ వచ్చింది. కానీ, ఘోరీ మహమ్మద్‌లో యెట్టి పరిణామము కలుగలేదు. తరువాత జయచంద్రునికి ఆశ చూపి, అతని ద్వారా పృధ్వీరాజును ఓడిస్తాడు. ఆసమయములో పృధ్వీరాజు ఘోరీ మహమ్మద్ చేతిలో చిక్కాడు. పదిహేడు పర్యాయములు తనను క్షమించి వదిలిపెట్టినందుకు కృతజ్ఞత చూపకుండా పృధ్వీరాజు కన్నులను పెరికివేశాడు. అందువలన, అపకారము చేయువారికి ఉపకారము చేయకూడదని యీ చరిత్ర మనకు తెలియచేస్తుంది. విశ్వాసఘాతకులకు, చేసిన మేలు మరచినవారికి ఉపకారము చేయకూడదని యీ చరిత్ర మనకు నిరూపిస్తుంది. ఇలాంటి జీవిత తత్త్వాన్ని మనము చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. మనము త్యాగములో ప్రవేశించాలి. కష్టములందు, బాధలందున్నవారికి సహాయం చేయటానికి ప్రయత్నించాలి. ఏ సమయమునందు ఏ వ్యక్తికి, ఏ సహాయము చేయాలనే విషయ పరిశీలనము చెయ్యాలి. ఈ విధమైన విచారణ శక్తితో మనము ఉపకారమునకు పూనుకొన్నప్పుడు యితరులకు సహాయము చేయటమే కాకుండా మనముకూడా ఆనందమును పొందినవారమవుతాము.

**అహంకారము వేరు పురుగువంటిది**

విద్యార్థులారా! మనము విద్యను అభ్యసిస్తున్నాము. ఎట్టివిద్యను అభ్యసిస్తున్నాము?

ఎందుకోసము అభ్యసిస్తున్నాము? ముఖ్యముగా విద్యార్థులు గమనించవలసినవి, మూడు విషయములు. మనకు తెలియని విషయములను చెప్పుటకు పూనుకోకూడదు. ఇది అవివేకమవుతుంది. మనకు తెలియకపోయినప్పటికి తెలిసినట్లు నటించటము, ఇది ప్రమాదము. తెలుసుకొనుటకై ప్రయత్నించి దానిని క్షుణ్ణముగా తెలిసిన తరువాత చెప్పటానికి ప్రయత్నించాలి. తెలియక పూర్వమే తెలిసినట్టుగా భావించటము పెద్ద తప్పు. తెలియని దానిలో ప్రవేశించటము మరొక పెద్ద తప్పు. తెలియని దానిని చక్కగా తెలిసికొనటము, ఆ తెలిసికొన్నదానిని చక్కగా ప్రబోధించటము సరైన మార్గము. ఈనాటి మానవత్వములో అన్నీ తెలిసినవానివలె నటిస్తున్నాము. ఇదే అహంకారము. ఈ అహంకారము మానవుని అధః పతనము చేస్తుంది. అహంకారము, వృక్షమునకు వేరు పురుగువంటిది. దీనికి రాగము, ద్వేషము అని తోడు దొంగలైన మిత్రులుంటున్నారు. ఈ ముగ్గురు చేరితే మన జీవితము పూర్తిగా అడుగంటిపోతుంది. కనుక, మొట్టమొదట మనలో అహంకారమునకు యేవిధమైన అవకాశము యివ్వకుండా చూచుకోవాలి. ఈ అహంకారమునకు ఏది కారణము? కేవలము అజ్ఞానమే కారణము. సర్వము గుర్తించిన వ్యక్తిలో అహంకారము ప్రవేశించటానికి అవకాశము లేదు. మొట్టమొదట మనము అహంకారమును దూరము చేసి వినయ విధేయతలను పెంచుకున్నప్పుడే విద్య మనకు అలవడుతుంది.

**నిరాడంబరతను నేర్చుకోవడానికి ప్రయత్నించాలి**

ఈనాడు మానవత్వములోపల విచిత్రమైన ఆధునిక గుణములు ప్రవేశిస్తున్నాయి. విద్యకు, వివేకమునకు మధ్యనున్న భేదమును తెలుసుకొనే విచారణాశక్తి మానవునకు లేకపోతున్నది. విద్యలో అన్నింటిని తెలుసుకొనే స్థితి ఉన్నది. మనము ఆడంబరాలకోసమని మన జీవితమును యెక్కువ ధారపోస్తున్నాము. నిరాడంబరమనేది నేర్చుకోటానికి ప్రయత్నించాలి. మీరు చరిత్రలో చదివి ఉంటారు. సర్దార్ పటేల్ డిప్యూటీ ప్రైమినిష్టరుగా ఉంటున్న సమయములోపల మహావీర్ త్యాగి హోమ్ మినిష్టరుగా ఉంటుండేవాడు. అతడు ఒకనాడు పటేల్ యింటికి వచ్చాడు. అతను మాట్లాడుతున్న సమయములో పటేల్ కుమార్తె మణి బెహన్ అక్కడ తిరుగుతున్నది, ఇంటి పనులుచేస్తూ. ఆమె పాతపంచెలను అతికించి చీరగా కట్టుకొని పనిచేస్తున్నది. పటేల్

sri sathyasai vahini amrutam

అక్కడే ఉండినప్పుడు మహావీర్ త్యాగి మణి బెహన్‌ను ప్రశ్నించాడు: “మణిబెహన్! నీవు నీ తండ్రి గౌరవమునకు అప్రతిష్ఠ తెస్తున్నావు. తండ్రిగారు యెలాంటి స్థానములో ఉంటున్నారు? ఆయన డిప్యూటీ ప్రైమినిష్టరుగా ఉంటున్నారు. ఆయన కుమార్తెవైన నీవు యీ విధముగా ఉంటే అందరూ నిన్ను బిచ్చగత్తెగా భావిస్తారు. నీకు ఈ డ్రెస్సు సరియైనది కాదు”, అన్నాడు. ఆమెకు కోపం వచ్చింది. గట్టిగా నిల్చుని యీ విధముగా చెప్పింది “త్యాగిగారూ! నీతి, నిజాయితీ లేకుండా సంపాదించిన వారికి అవమానముగాని కష్టపడి నా కర్మలు చేస్తూ నేను బట్టలు యేవిధముగా ధరించినప్పటికి నాకు యే అవమానము లేదు. ఈనాడు లోకములో తల్లిదండ్రులు కష్టపడి ఆర్జించిన ధనమును వినియోగిస్తూ, తల్లిదండ్రుల ఆస్తిపాస్తులను అడుగంటింప చేసేవారికి అవమానముగానీ నాకు ఏ అవమానము లేదు. కష్టపడి పనిచేసి తండ్రి గౌరవమును కాపాడుకుంటూ నాకిష్టమైన రీతిగా బట్టలను వేసుకుంటున్నాను. పరుల సొత్తులోని ఒక కాసైనా తీసుకోను. నా గౌరవ మర్యాదలు నాకు తెలుసు”, అని చెప్పి వెళ్ళిపోయింది. అదే సోఫాపైన సుశీలానయ్యర్ కూర్చొని ఉంది. అప్పుడామె మహావీర్ త్యాగికి చక్కగా చెప్తున్నది: “త్యాగీ! మణీబెన్ విషయము నీకు సరిగా తెలియదు. మణిబెహన్ తెల్లవారి లేచినది మొదలు సాయంకాలమువరకు క్షణమైనా విశ్రాంతిలేక పని చేస్తుంది. తండ్రి డిప్యూటి ప్రైమినిష్టరు అయినప్పటికి యింట్లోని పని అంతా తానే చేస్తుంది. పాత్రలన్నీ తానే తోముతుంది. తండ్రి బట్టలన్నీ తానే ఉతుకుతుంది. సమయము చిక్కినప్పుడు రాట్నముపై నూలు వడుకుతుంది. ఆ వడికిన దారముతో తండ్రికి చొక్కాలు, పంచెలు కుడుతుంది. తండ్రి విసర్జించిన ధోవతులను ఒకటి రెండింటిని చేర్చి చీరలుగా ధరిస్తుంది. ఈ విధమైన ఆదర్శ జీవితాన్ని మరొకరు అందించలేరు”. అటువంటి పవిత్రమైన జీవితాన్ని మణిబెహన్ గడిపేటువంటిది. అటువంటి ఆదర్శ జీవితాన్ని యీనాటి యువకులలో, యువతులలో ఒక్కరుకూడా గడుపలేరు. కేవలము లోకాడంబర నిమిత్తమై సంచరిస్తూ ధనమును వ్యర్థము చేస్తూ, తల్లిదండ్రులకు కష్టము కలిగిస్తూ వున్నారు.

**‘భావమందు దుష్టభావము వీడుటే త్యాగమగును’**

విద్యార్థులారా! మీ జీవితము, మీ రక్తము, మీ దేహము, మీ సర్వస్వము తల్లిదండ్రుల

ప్రసాదము. అలాంటి తల్లిదండ్రులకు సాధ్యమైనంతవరకు కష్టము కలగకుండా చూచుకోవాలి. కేవలము ఆడంబరముల నిమిత్తమై తల్లిదండ్రులు సంపాదించిన ధనమును దుర్వినియోగము చేయకండి. దీనినే మనము Don't waste food, Don't waste time, Don't waste money, Don't waste energy. అని నాలుగు విభాగములుగా విభజించుకున్నాము. ఇదే celing on desires అన్నారు. మన కోరికలను సాధ్యమైనంతవరకు అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించాలి. తల్లి దండ్రులు యెంత కష్టపడి మిమ్మల్ని సాకుతున్నారో మీ అభివృద్ధికోసం ప్రయత్నిస్తున్నారో మీకు తెలియటం లేదు. అధిక శ్రమను వారికి అందించకుండా మనకు తగిన పనిని మనము చూచుకోవాలి. సత్యసాయి యిన్స్టిట్యూట్‌కి వచ్చినందుకు సరియైన ఆదర్శమును మీరు నిరూపించాలి. ఇదే మీరు నిజముగా చేయవలసిన ప్రధానమైన త్యాగము. యిల్లు, వాకిలి, ఆలు బిడ్డలను విడచి అరణ్యములకు వెళ్లటము త్యాగము కాదు. భావమందు దుష్టభావము వీడుటే త్యాగము అగును, అదియే యోగమగును. దుష్టభావములు, దుష్టసంకల్పములు ఉండినంతవరకు సద్భావములను త్యాగము చేసిన వారమవుతాముగాని, దుష్టభావములను త్యాగము చేసినవారము కాము. విలువైన భోజనము చేయటము, విలువైన వస్త్రములను ధరించటము, విలువైన జీవితమును అనుభవించటము భోగము కాదు. దీనిలో కాదు మనము గొప్పవారము కావలసినది. ఆశలను తగ్గించుకొని శాంతి మార్గమునకు కృషి సల్పటం త్యాగము. మితిమీరిన కోరికలను, ఆశలను పెంచుకొని మతి తప్పించుకోటం త్యాగము కాదు.

**మనకేది ప్రీతికరమో, ప్రధానమో దానిని త్యాగము చేయుటే నిజమైన త్యాగము**

ఒకానొక సమయములో ఒకరు బుద్ధుని ప్రశ్నించారు, 'Who is the richest man in the world? అని. అప్పుడు బుద్ధుడు He who has much satisfaction is the richest man, అన్నాడు. తిరిగి 'who is the poorest man in the would, Master'. అని ప్రశ్నించారు. He who has many desires is the poorest man in the world' అని బుద్ధుడు సమాధానము చెప్పాడు. ఈ విధమైన త్యాగబోధలను చేస్తున్న బుద్ధుని ప్రసంగము విని ఒక మహారాజు బుద్ధుని మెప్పు పొందాలని ఆశించాడు. బుద్ధుడు తన దగ్గర యెప్పుడూ ఒక దమరుకము

srisathyasaivachanamrutam

పెట్టుకొనేవాడు. ఆయన శిష్యుడు ఒకరు 'స్వామీ! మీరు ఎప్పుడూ డమరుకమును ఎందుకు దగ్గర పెట్టుకుంటున్నారు', అని ప్రశ్నించాడు. 'ఎవడు పరిపూర్ణ త్యాగముతో నావద్దకు వస్తాడో ఆనాడు యీ డమరుకమును వాయిస్తాను' అన్నాడు. ఎవరు అటువంటి పెద్ద మనిషని అందరూ ఏక దృష్టితో చూస్తున్నారు. ఈ విధమైన స్థానమును పొందాలని ఒక మహారాజు ఏనుగులపై ధనము వేసికొని బుద్ధునివద్దకు వస్తున్నాడు. బుద్ధునకు ధనమిచ్చి గొప్పవాడని అనిపించుకోవాలనే ఉద్దేశ్యముతో వస్తున్నాడు. దారిలో వస్తున్న సమయములో ఒక ముసలమ్మ 'ఆకలి అవుతున్నది, నాకేమైనా పెడతారా?' అని అడిగింది. ఆ మహారాజు తనవద్ద ఉన్న దానిమ్మ పండును ఆ ముసలమ్మకు యిచ్చాడు. ఆ ముసలమ్మ దానిమ్మ పండును పట్టుకొని బుద్ధునివద్దకు వచ్చింది. ఇంతలో ఆ మహారాజు బుద్ధునివద్దకు వచ్చి డమరుకము ఎప్పుడు కొడతారా అని వేచిఉన్నాడు. ఎంతసేపు అయినప్పటికి బుద్ధుడు డమరుకము మోగించలేదు, అతను కూడా లేవలేదు. ఇంతలో ముసలవ్వ అలసిపోయి వచ్చి వణుకుతున్న చేతులతో దానిమ్మ పండును బుద్ధునికిస్తుంది. వెంటనే బుద్ధుడు డమరుకము వాయించాడు. తాను ఇంతడబ్బు యిచ్చినందుకు బుద్ధుడు డమరుకము వాయించలేదు. ఇంత చిన్న పండు యిచ్చినందుకా డమరుకము వాయించుట యిదా త్యాగము, అని ఆ మహారాజు బుద్ధుని ప్రశ్నించాడు. అప్పుడు బుద్ధుడు చెప్పాడు, 'మహారాజా త్యాగములో క్వాంటిటీ కాదు ముఖ్యము, క్వాలిటీ ముఖ్యము. మహారాజు బంగారమును దానము చేయటము సహజమే కాని ఆకలిగొన్న ముసలవ్వ ప్రాణమునుకూడా లెక్క చేయకుండా త్యాగము చేయుట గొప్ప. త్యాగమనగా పనికిరానిది త్యాగము చేయటము కాదు. మనకేది ప్రీతికరమో, మనకేది ప్రధానమో దానిని త్యాగము చెయ్యాలి. అదే నిజమైన త్యాగము. మనకు ప్రీతి ప్రాణసమానము. కనుక సమస్త వస్తువులకంటె ప్రేమ అతి విలువైనది. అట్టి విలువైన ప్రేమను మనము మొట్టమొదట త్యాగము చేయాలి. మనము తల్లిదండ్రులకు విలువ నందించాలి. ఆ తల్లిదండ్రులకు ప్రేమ అందించలేకపోవటము, గొప్పవారికికూడ సరికాదు. లోకములో పేరుప్రతిష్టల నిమిత్తమై అనేక త్యాగములు మనము చేస్తున్నాము. సత్రాలు కట్టిస్తున్నాము, ఆస్పత్రులు కట్టిస్తున్నాము. ఇది కాదు సరైన త్యాగము, తల్లితండ్రులను సంతృప్తిపరచి యేమైనా చేసుకో. 'మాతృదేవో భవ పితృదేవో భవ'. ఈ రెండింటిని నీ లక్ష్యములో ఉంచుకోవాలి. కానీ, ఒకవైపున తల్లి తండ్రులకు కష్టాలనందిస్తూ ఉన్నాము. మన స్వార్థాన్ని,

sri sathyasai vachanamrutam

మన స్వప్రయోజనాన్ని మాత్రమే లక్ష్యములో ఉంచుకుంటున్నాము. కనుక, యీ స్వార్థాన్ని త్యాగము చేయాలి. స్వార్థము ఉండినంతవరకు మానవుడు అభివృద్ధి చెందలేడు. అందువలన, విద్యార్థులారా! మనము స్వార్థాన్ని త్యాగముచేసి, విశ్వసించిన దైవాన్ని సంతృప్తిపరచే మార్గములో మన జీవితాన్ని అంకితము చేయాలి.

## మనలో మాలిన్యమున్నంతవరకు అట్టడుగున పడి ఉంటాము

ఈ ప్రపంచమంతా భగవంతునిదే. సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతుడు ఒక చోట ఉన్నాడు, మరొకచోట లేడు అని మనము భావించరాదు. చిన్న ఉదాహరణ. మీ పాటలు, నామాటలు టేప్‌రికార్డింగు చేసింది. అయితే, యీ పాటలు మాటలు యెక్కడున్నాయి? అవి టేపులో ఉన్నాయి. యివి టేప్‌లో మనకు కనుపిస్తాయా? లేదు. ఆ టేపును ముక్కలు ముక్కలు చేసినా మనకు యేమీ కనుపించదు, వినిపించదు. కానీ రికార్డరును కరెంటుతో కనెక్టు చేసినప్పుడు మాటలు పాటలు చక్కగా వినిపిస్తాయి. అదే విధముగా భగవంతుడు 'ఈశ్వర స్సర్వభూతానామ్' అన్నట్లు సర్వత్ర వ్యాపించి ఉన్నాడు. మన దేహములోకూడా సర్వత్ర ఉన్నాడు. ఎక్కడ ఉన్నాడు యీ దేహములో అని ముక్కలు ముక్కలుగా దేహమును కోస్తే దైవము కనుపించడు. కానీ నీ మైండ్ అనే ప్లగ్ భగవచ్చింతన అనే దానిలో పెట్టినప్పుడు మనకు దైవము కనుపిస్తాడు. ఆవిధముగా భగవంతునికొరకై యత్నము చేయక భగవంతుడెక్కడ ఉన్నాడు, ఉంటే కనుపించటము లేదే అంటారు. చంద్రమండలము వెళ్లాము, అక్కడ కూడా దేవుడు కనుపించలేదే అంటారు. వారు యంత్రాలను ఆధారముగా చేసుకుని వెళ్లారు. కానీ మనము మంత్రాలను ఆధారముగా చేసుకోవాలి. ఆదివ్యమైన ప్రేమ మనలో లేకపోతే, సర్వత్రా ఉండిన భగవంతుడు మనము ఎక్కడికి వెళ్లినా కనుపించడు. ప్లేన్ గంటకు యెన్నో వందల మైళ్ల వేగముతో పోతుంది. కానీ ఆ ప్లేనులో పెట్రోలు లేకపోతే ఒక యించియైనా ముందుకు వెళ్లదు. అదేవిధముగా మనలో భగవన్నామమనే పెట్రోలు లేకపోతే మనము ముందుకు వెళ్లలేము. భగవన్నామమనే పెట్రోలును మనలో వేసుకున్నప్పుడు మనము భగవత్ సాక్షాత్కారాన్ని పొందగలము. యీనాడు ఈ ప్రేమను మనము ప్రకృతిపై ప్రసరింపచేస్తున్నాము. భగవంతునిపైన ప్రసరింపజేయుటము లేదు. ఈ ప్రేమతత్త్వమనే పెట్రోలును ప్లేనులోని

srisathyasaivachanamrutam

టాంకులో వేసినప్పుడు ప్లేను పరుగెత్తుతుంది గాని, వేరే ఎక్కడోవేస్తే ప్లేను ఎట్లు పరుగెత్తుతుంది?

ఇంకొక చిన్న ఉదాహరణము. చాలామందికి తెలిసే ఉంటుంది. ఆవు దూడను వేస్తుంది. వేసిన తక్షణమే అది మలిన పదార్థముతో కప్పబడి ఉంటుంది. మలిన పదార్థమును తీసివేసినప్పుడే దూడ లేస్తుంది. తల్లి ఆవు మలిన పదార్థమును నాకి నాకి మాలిన్యమును తినివేస్తుంది. మాలిన్యము పోగానే దూడ తక్షణము లేస్తుంది. అదేవిధముగా మనలో మాలిన్యము ఉండినంతవరకు దూడవలె అట్టడుగున పడిఉంటాము. మాలిన్యము పోగానే లేస్తాము.

**ఈనాడు మనకు కావలసినది, మానసిక పరిణామము**

ఈ మాలిన్యమును మనము యేరీతిగా దూరము చేయాలి? ఇందుకు భజన, భగవచ్చింతన, భగవత్ప్రేమ అవసరము. అప్పుడు నిత్య శుద్ధ బుద్ధుడవైపోయి భగవత్తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తావు. ఈ విధమైన చిన్న చిన్న విషయములందే భగవంతుని ఆనందించి, అనుభవించి, పరులకు అందించటానికి సులభమైన మార్గాలు లభిస్తాయి. ఈనాడు మనకు కావలసినది రాజకీయ పరిణామము కాదు. ఆర్థిక పరిణామము కాదు, విద్యా పరిణామము కాదు, మానసిక పరిణామము కావాలి. మనసు మారక నీవు యెంత ఉన్నతస్థాయికి పోయినప్పటికిని యేమీ ప్రయోజనము ఉండదు. కీర్తి, గౌరవము గొప్పవిగా ఉండవచ్చు. కానీ, యివి లోకానికి సంబంధించిన విషయాలు. భగవంతుని మనస్సు కదిలించి, కరగించాలనుకుంటే పరిశుద్ధ భావాలు మనలో ఉండాలి. మన హృదయాన్ని భగవదర్పిత భావముతో పవిత్రము చేసుకోవాలి. దీనికి ముందు మనము మన హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. కానీ, ఈనాడు మనము మన హృదయాన్ని తుచ్ఛమైన భావములతో నింపుతున్నాము.

**ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలగునా**
**తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతము నింపనగునా**

ఈ టంబ్లర్‌లో మనము పాలునింపాలనుకొంటే యిందులోని నీరు ఖాళీ చేసినప్పుడే దానిలో పాలు నింపటానికి వీలవుతుంది. మనలోని దుర్భావములు దూరము చేసినప్పుడే సద్భావములను



srisathyasaivachanamrutam

దానిలో నింపటానికి వీలవుతుంది. త్యాగము చేసినప్పుడే ఆనందాన్ని అందుకోటానికి వీలవుతుంది.

**మృత్యువును వాయిదా వేయడానికిగాని, కేన్సిల్ చేయడానికిగాని వీలులేదు**

త్యాగమనేది విద్యార్థికి చాలా ప్రధానమైనది. విద్యార్థులు ఈవిధమైన త్యాగములో ప్రవేశించినప్పుడే ప్రపంచమంతా మార్చటానికి శక్తివంతులుగా మారుతారు. విద్యార్థులారా! కేవలము ప్రపంచ వాంఛలకోసము, భౌతిక, భోగభాగ్యములకోసము మనము యేమాత్రము ప్రాకులాడరాదు. లోకసంబంధమైన వాంఛలుండవలసినదే! కానీ, దేనికైనా పరిమితి ఉండాలి. స్వామి సచ్చిదానంద చెప్పినట్లుగా యేదీ మన లక్ష్యములో లేకపోయినప్పటికిని మృత్యువును మన లక్ష్యములో ఉంచుకోవాలి. ఏ ప్రయాణము మనము సలిపినా సలపకపోయినా దానిని పోస్టుపోన్ చేసినా చేయకపోయినా, కేన్సిలు చేసినా చేయకపోయినా అంత్యప్రయాణమును మాత్రము పోస్టుపోన్ చేయటానికిగాని, కేన్సిల్ చేయడానికి గాని వీలులేదు. ఏదో రెండు మూడునెలలు యిక్కడ ఉండి, తరువాత తల్లితండ్రులవద్దకు చేరుతున్నాడు. ఇది టెంపరరీ డెత్. కానీ, పర్మనెంటు డెత్ ఉంది. ఇది చిన్న నిద్ర. అది పెద్ద నిద్ర. ఈ రెండూ లేకపోతే మానవునకు సుఖమే లేదు. భుజించకపోయినా జీవించవచ్చుగాని, నిద్రలేకపోతే వ్యాధిగ్రస్తుడైపోతాడు. కనుక, మనము నిరంతరము సత్యమనేదానిని గుర్తించటానికి ప్రయత్నించాలి.

**దేనినీ మితిమీరి ఆశించరాదు**

శాంతి శాంతి అంటాము, శాంతి మనకెక్కడ లభిస్తుంది? ఎన్ని భవనములు కట్టినా శాంతి మనకు లభించదు. ఎంత ధనమును సంపాదించినా మనకు శాంతి లభించదు. మైదాస్ చరిత్ర దీనికి మంచి తార్కాణము. మన ఆశలకుకూడా కొంత పరిమితి ఉండాలి. మితిమీరిపోతే ధనమునకుకూడా విలువ తగ్గిపోతుంది. తెలివి తేటలకుకూడా పరిమితి ఉండాలి. తెలివి తేటలున్నాయని అంతా విచారించటానికి ప్రయత్నించరాదు. ఏది, ఎక్కడ, ఎప్పుడు, ఏవిధముగా అవసరమో ఆవిధముగా చేయాలి. దేనినీ మనము మితిమీరి ఆశించరాదు. అతి ఆశ మతిహాని. మిత ఆశ అతిహాయి. కనుక, మితమైన జీవితాన్ని గడపటానికి హితమైన

sri sathyasaivachanamrutam

జీవితాన్ని గడపటానికి విద్యార్థులు పూనుకోవాలి. ఇక్కడ వాతావరణము యేమిటి, దేని నిమిత్తమై మనము యిక్కడకు వచ్చాము అనే దానిని మనము నిత్యమూ చింతించాలి. ఈ విధమైన వాతావరణములో మనము ప్రవేశించినందుకు వాతావరణమునకు అనుగుణముగా ప్రవర్తించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! ఏవిధమైన ప్రతిఫలమునూ ఆశించి మనము యీ విద్యాసంస్థలను స్థాపించలేదు. ఈనాడు అనాచార, అక్రమ, అన్యాయములతో తులతూగుతున్న యీ జగత్తునకు సరైన విద్యార్థుల ఆదర్శాన్ని నిరూపించే నిమిత్తమై యీ విద్యాసంస్థలను స్థాపించాము. ఆధ్యాత్మిక సంపత్తికి నిలయమైన భారతదేశము నేడు ధర్మమునకు దూరమైపోయి, సత్యమునకు దూరమైపోయి, అధర్మ, అక్రమ, అనాచారములతో అలమటిస్తున్నది. విద్యా విషయమునందుగాని, ఉన్నత విషయమునందుగాని, ఉన్నతస్థాయియందుగాని మీరు వెనుకంజవేసిన, మీ తల్లిదండ్రులు యెంత బాధపడుతారో, అంతకు వేయింతలు బాధ స్వామికి ఉన్నది. మీరు దారి తప్పి నడవకూడదు. మీ తల్లిదండ్రులైనా మీనుంచి ఫలితాన్ని ఆశించి మిమ్మల్ని ప్రేమిస్తుంటారు. కానీ, మీనుండి నేను దేనిని ఆశించటము లేదు. మీరు ఆదర్శమూర్తులుగా తయారై భారతదేశమునకు సత్కీర్తి తెస్తారనే ఉద్దేశ్యముతో నేను యీ సంస్థలను స్థాపించాను.

విద్యాసంస్థల విషయము మీకు తెలియనిది కాదు. కిండర్‌గార్టెన్‌లో జాయిన్ చేయాలంటే విద్యార్థికి ఐదువేలో పదివేలో డొనేషన్ యివ్వాలి. ఈనాడు విద్యా సంస్థలలో ప్రవేశము పొందాలంటే మహాశ్రమతో కూడినపని. వ్యయము చాలా అధికముగా ఉంటున్నది. కానీ, మన సంస్థలలో యే బాధాలేదు. మేము లైబ్రరీ ఫీజులని, లేబరేటరీ ఫీజులని తీసుకోటం లేదు. అంతేకాదు, భవిష్యత్తును దృష్టియందుంచుకొని అనేకమైన అనుకూలములను సమకూర్చుతున్నాము. ఇలాంటి అనుకూలమైన వాతావరణములో ఉండికూడా మీరు ఉన్నతస్థాయికి చేరుకోలేకపోతున్నారంటే అది నిజముగా దురదృష్టకరమే! ఈనాడు దేశములో చెలరేగుతున్న అశాంతిని సరిజేసే సమర్థత విద్యార్థులకే ఉన్నదన్న విశ్వాసము మాలో అధికముగా ఉన్నది. మీరు బాగుపడి యితరులను బాగుపరచటానికి తగిన కృషి చెయ్యాలి. మీరే

sri sathyasai vahini amrutam

బాగుపడకపోయిన, యితరులను యేవిధముగా బాగుపరచగలరు? First self, next help. ఈనాడు ప్రాపంచిక దృష్టి యేరీతిగా ఉందంటే పూర్వపు ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరించేవారు కరువైపోయారు.

**నీది కాదు, అంతా దైవముదే**

చిన్న ఉదాహరణము. ఒకానొక సమయములో శ్రీరామచంద్రుడు లంక నుండి తిరిగి వచ్చి పట్టాభిషేకము జరిగిన తరువాత రాజ్యము పరిపాలిస్తున్నాడు. ఆ సమయములో ఒకనాడు ఆనందముతో, ఉల్లాసముతో ఉండినప్పుడు కైక దగ్గరకు వచ్చింది. "రామా! నీవు సాక్షాత్ భగవంతుడివి. నీతత్త్వమును గుర్తించలేక మహాపరాధము చేశాను. పాపము చేశాను. ధర్మమూర్తివైన నిన్ను కారడవులకు పంపాను. స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై నిన్ను కష్టముల పాలు చేశాను. దీనికి పరిహారమేమైనా ఉన్నదా", అని అడిగింది. సర్వజ్ఞుడైన రామునికి అన్నీ తెలుసు "పిన్నీ! నీవు సరయూ నదిలో స్నానం చేసిరా! అన్నీ మాట్లాడుకుందాము", అని చెప్పాడు. "ఈ సరయూ నదికి వెళ్ళినప్పుడు, సరయూ నది తీరాన గొఱ్ఱెలు, మేకలు మేస్తూ ఉంటాయి. అవి ఏమంటున్నది గమనించి రమ్మని" చెప్పాడు. గొఱ్ఱెలు, మేకలు యేమంటున్నాయో గమనించమని అన్నాడని కైక నదీ తీరాన నిల్చుని గొఱ్ఱెలు, మేకలు చేసే ధ్వనులను శ్రద్ధగా వింటున్నది. అన్నీ 'మే, మే', అని అరుస్తున్నవి. కైక కోసమై రాముడు కాచుకొని ఉన్నాడు. 'మే,మే' అని అరుస్తున్నాయి, అంది. 'మే' అనగా నాది. అయితే యేది తనది? అంతా నాదనుకుంటున్నావు. నీవు ఇల్లు అమ్మిన తరువాత ఆ ఇల్లు నీది కాదే! ఈ దేహము నీదని అనుకుంటున్నావు. మరణించిన తరువాత యీ దేహము నీది కాదు. ఈ చొక్కా నాది, నాది అనుకుంటున్నావు. చినిగిపోయిన తరువాత యీ చొక్కా నీదికాదే! ఇవన్నీ passing clouds వస్తున్నాయి, పోతున్నాయి. యీ ప్రపంచము పేరే జగత్. 'జ' అనగా పుట్టుట, 'గత్' అనగా పోవుట. అనగా పుట్టుట, పోవుట ప్రపంచ లక్షణము.

ఈ ప్రపంచంలో ఏదీ నీది కాదు. సర్వమూ భగవంతునిదే! కనుక, పూర్వమంతా కూడా first, God, next world, last I అని భావించేవారు. మనము భగవంతుని ప్రపథమముగా లక్ష్యములో ఉంచుకున్నప్పుడు 'నేను' అనే మానవత్వానికి యేనాటికి గురికాలేరు. తానే

srisathyasaivachanamrutam

చూచుకుంటాడు. కానీ ఈనాడు వుల్టాసీదాగా మారిపోయింది. First I, next world, last God.

దీనికి చక్కని ఉపమానము ఉంటున్నది. పాండవులు కృష్ణుడే ప్రధానమైన వాడని భావించేవారు. అగ్రతాంబూలము నిండుసభలో కృష్ణునికి యిచ్చేవారు. మా జీవితాన్ని లెక్కచేయము. "మా ధర్మమూర్తి, మా ప్రేమమూర్తి మా సర్వము కృష్ణుడే!" అని భావించారు. రథము లోపల కృష్ణుని ముందు పెట్టుకొని, తాను వెనుక నిల్చుని యుద్ధము చేశాడు, అర్జునుడు. పాండవులు, కృష్ణుని ముందు పెట్టుకొని యుద్ధము చేశారు కనుక వారికి అంతా విజయమే కలిగింది. కౌరవులు తాము ముందు, సైన్యము రెండవది, కృష్ణుని వెనుకకు ఉంచారు. అందువలన సర్వమార్గములలో అపజయము పొందారు. ధృతరాష్ట్రుడు సంజయుని అడిగాడు. 'సంజయా యుద్ధభూమికి వెళ్లి వచ్చావు కదా! జయ మెవరికి కలుగుతుంది? పాండవులకా, కౌరవులకా?' అని ప్రశ్నించాడు, మహారాజు.

**పరమాత్ముని ముందుంచుకున్నవారు తప్పక విజయము పొందుతారు**

'ఎక్కడ పవిత్రమైన పరమాత్ముడు ఉన్నాడో, అతని వెనుక అర్జునుడున్నాడో అక్కడ విజయము లభిస్తుంది', అన్నాడు సంజయుడు. అనగా ఎవరు పరమాత్ముని ముందుంచుకుంటాడో వారు తప్పక విజయము పొందుతారు. అహంకారాన్ని ముందుంచుకొని పరమాత్ముని వెనుక ఉంచుకున్నట్లైతే వారికి అపజయమే! దీనినే మహాభారతము చక్కగా యెత్తి చూపిస్తున్నది. కనుక, మనము ప్రతి విషయములోకూడా భగవంతుని మొట్టమొదట స్మరించాలి. తదుపరి నీ కార్యములు, నీ కర్తవ్యములు యే విధముగా ఆచరించినప్పటికి ఫరవాలేదు. కృష్ణుని సహాయం చేయమని కోరడానికి వెళ్ళినప్పుడు అర్జునుడు ఏ విధముగా చేశాడు? దుర్యోధనుడు అహంకారముతో కృష్ణుని తలవద్ద కూర్చుంటే, అర్జునుడు భక్తి ప్రపత్తులతో కృష్ణుని పాదములవద్ద కూర్చొన్నాడు. కృష్ణుడు లేచినప్పుడు మీ సహాయంకావాలని యిద్దరూ కృష్ణుని అడిగారు. 'నా సైన్యము ఒకవైపున, నేనొకవైపున, మీకు ఎవరు కావాలి', అని ప్రశ్నించాడు, కృష్ణుడు. అప్పుడు అర్జునుడు 'కృష్ణా! నీవు ఒక్కడవూ నాకు చాలు' అన్నాడు. 'అర్జునుడు యీ విధముగా కోరాడని దుర్యోధనునికి చాలా సంతోషమై పోయింది. నాకు

srisathyasaivachanamrutam

సైన్యమే కావాలన్నాడు. ఫలితంగా అర్జునునికి యింజను వచ్చింది. దుర్యోధనునికి కంపార్టుమెంటులు దొరికాయి. ఇంజను లేకుండా ఎన్ని కంపార్టుమెంటులుంటే యేమి లాభము? దుర్యోధనునకు పదకొండు లక్షల కంపార్టుమెంటులున్నాయి. కానీ యింజను (కృష్ణుడు) అర్జునుని చేతిలో ఉన్నది.

విద్యార్థులారా! చక్కగా గమనించండి. మహాభారతము పంచమవేదము. భారతములో లేనివి మరెక్కడా లేవు. కృష్ణుడు లేకుండా ఒక్కక్షణముకూడా గడిపే వారు కాదు. సంధికుదిర్చే నిమిత్తమై ధృతరాష్ట్రునివద్దకు కృష్ణుడు రాయబారిగా వెళ్లాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు: 'కృష్ణా! నీకు యిరువురూ సమానమే కదా! నీకెందుకింత పక్షపాత'మన్నాడు. 'ఓ గుడ్డిరాజా! నాకు యిరువురు యేనాటికి సమానము కాదు. పాండవులకు, నాకు ఉన్న సన్నిహిత సంబంధ బాంధవ్యమును గుర్తించమన్నాడు. పాండవులు నిరంతరము కృష్ణుని ఆజ్ఞను శిరసావహించి పాలిస్తున్నారు. కృష్ణుడు లేక పాండవులు లేరు. పాండవులు లేక కృష్ణుడు లేడు. చిన్న ఉదాహరణ. ధర్మరాజు శిరస్సువంటివాడు. అర్జునుడు భుజములవంటివాడు. భీముడు పొట్టవంటివాడు. నకుల, సహదేవులు పాదములు. ఈ ఐదుగురు చేరి ఒక ప్రాకృతమైన దేహము. కానీ, యీ దేహములో కృష్ణుడు గుండెవంటివాడుగా ఉన్నాడు. గుండె లేకపోతే దేహానికి విలువలేదు. పాండవుల, కృష్ణుని సంబంధమటువంటిది. 'కరిష్యే వచనం తవ' అన్నాడు. స్వామీ! మీ వచనము తప్పనాకు అన్యము లేదు. మీరు ఏది చెప్పినా అది చేస్తానన్నాడు.

**విద్యార్థులు మంచిపేరు తెచ్చుకోవటమే స్వామికి కావలసినది**

జీవితములో కష్టాలు, నష్టాలు ఉంటాయి, కానీ వాటిని నెట్టుకొని ముందుకు పోయినవాడే ధీరుడు. మీరు యేమాత్రము చలించని మనస్సు కలిగి, భ్రమించని దృష్టి కలిగి, సమత్వాన్ని చాటడానికి ప్రయత్నించాలి. వచ్చినటువంటి కార్యాన్ని మీరు చక్కగా సాధించండి. తల్లితండ్రులకు సంతోషాన్నివ్వండి. ఆదర్శజీవితమును లోకానికి అందించండి. మీరు మాకు అందించవలసినది ఒక్కటే! మీరు ఇన్స్టిట్యూట్‌లో చదివినందుకు యీ విద్యార్థి యెంత ధైర్యశాలి, ఎంతటి ధీమంతుడు, ఎంతటి ఆదర్శవంతుడు అన్న పేరుతెచ్చుకుంటే అదే మాకు చాలు. మంచి పేరు తేవటమే నాకు కావాలి. కుమారుడు పుట్టాడని చక్కెరో, తీపో పంచుతారు. కానీ స్వామికి

sri sathyasaivachanamrutam

అలాకాదు. ఏనాడు మీరు మంచిపేరు తెచ్చుకుంటారో అదే పుట్టినదినము. 'పుత్రోత్సాహము పుత్రుడు జన్మించగానే పుట్టదు, జనులు ఆపుత్రుని కనుగొని పొగడ పుత్రోత్సాహంబు.' ఏనాడు జనులు మిమ్మల్ని మంచివాడని పొగడుతారో ఆనాడే తండ్రికి పుత్రోత్సాహము కలుగును. అట్టి గుణవంతులు కావాలంటే మీరు మితభాషులుగా తయారుకావాలి. దుష్ట భావాలను దూరము చేసుకోవాలి. వాక్కును అరికట్టాలి. చెడ్డను వినకుండా చూచుకోవాలి. ఎవరైనా చెడ్డ చెబుతూ ఉంటే మీరు వినుచూ కూర్చుంటే వాడు చెడ్డ చెప్పుతూ ఉంటాడు. చెడ్డను చెప్పకుండా చూచుకోండి. చెడ్డను వినకుండా చూచుకోండి. చెడ్డను చూడకుండా చూచుకోండి. అప్పుడు చెడ్డ తలంపులు మీలోరావు. చెడ్డ తలంపులు మీలో యెప్పుడు రావో అప్పుడు మీరు చెడ్డ చేయటానికి వీలుండదు.

**చదువుకున్నవాడికంటె చాకలివాడు మేలు!**

విద్యార్థులారా! ప్రేమ స్వరూపులారా! భగవంతుడెక్కడ ఉన్నాడంటే చెడ్డ తలంపులు, చెడ్డ శ్రవణము, చెడ్డపని ఎక్కడ లేకుండా ఉంటాయో అక్కడే భగవంతు డుంటాడు. పంచదోషములను నివారణ చేసుకుంటే మనమే పరమాత్మ అవుతాము. గుణములవలన మన జీవితము రాణిస్తుంది. గుణము పెంచని చదువులు చదువులే కాదు. చక్కగా యోచించండి. ఈనాటి చదువులలో నైతిక విలువ పూర్తిగా దిగజారిపోతున్నది. మన dhobi ఉంటాడు. పిల్లల బట్టలను యెన్ని తీసుకొని వెళ్లుచున్నది ఎక్కడా వ్రాసుకోడు. ఫలానా పిల్లవాని బట్టలు యిన్ని, ఫలానా పిల్లవాని బట్టలు యిన్ని అని జ్ఞాపకముంచుకుంటాడు. చదువుకొన్న పిల్లవాడు యిన్ని బట్టల నిచ్చానని వ్రాసుకుంటాడు. ఒక బనియన్, ఒక డ్రాయరు, ఒక పాంటు, ఒక షర్టు అని మనము యీ కొద్దిపాటి బట్టలకే వ్రాసుకుంటాము. కానీ చాకలివాడు అదేమీ వ్రాయడు. కరెక్టుగా బట్టలు తీసుకొని వస్తాడు. అందువలన చదువుకున్నవాడికంటె చాకలివాడు మేలు.

**భవిష్యత్తులో మంచి జరగాలంటే వర్తమానంలో మంచిగా జీవించండి**

విద్యలో మనము common sense, General knowledge అధికము చేసుకోవాలి. అనేక పర్యాయములు చెప్పాను. భూమికి ఆకర్షణ శక్తి ఉన్నదని చెప్పినవాడు న్యూటన్. చాలా తెలివితేటలు కలిగినవాడు. ఎప్పుడు చూచినా యోచిస్తూ ఉండేవాడు. అతనికి మితిమీరిన

sri sathyasai vachanamrutam

తెలివితేటలున్నాయిగాని General knowledge సున్నా. అతడు గదిలో ఉండి ఎప్పుడూ ఏదో ఒక పరిశోధన చేస్తూ ఉండేవాడు. అతనికి పెంపుడు పిల్లి ఒకటి ఉండేది. అతను తలుపు వేసి గదిలో ఉన్నప్పుడు బయటినుండి యీ పిల్లి మ్యావ్‌మ్యావ్ అని అరుస్తూ ఉండేది. ఇది యితనికి distrubance గా ఉండేది. ఆ పిల్లి యెప్పుడు యిష్టముంటే అప్పుడు లోపలకు వచ్చేందుకు తలుపుకు రంధ్రము చేయించాడు. కొన్నిదినముల తరువాత ఆ పిల్లికి పిల్ల పుట్టింది. ఆ చిన్న పిల్లికి యింకొక రంధ్రము పెట్టమన్నాడు. Carpenter అప్పుడు యేమి చెప్పాడంటే "సార్! ఒకే రంధ్రము నుండి రెండూ వచ్చిపోవచ్చుకదా! ఒక రంధ్రమునుండి ఎన్ని పిల్లులైనా పోవచ్చుకదా!" అన్నాడు. "అయ్యో! యీ carpenter కున్న general knowledge నాకు లేకుండా పోయిందే", అనుకున్నాడు. General Knowledge సంపాయించుకోటం కష్టము. Special knowledge యేవిధముగానైనా సంపాయించుకోవచ్చు. ఈ ప్రపంచములో మనము జీవించాలంటే general knowledge చాలా అవసరము. నిత్యజీవితములో సత్యమైన ఆనందమును అనుభవింపచేసేది general knowledge. ఇది భగవంతుని gift. ప్రతీదీ భగవంతుని ప్రసాదము. చాలామంది సంగీతం నేర్చుకోవాలనుకుంటారు. కాని, పాడటం ప్రారంభిస్తే యెన్నో అపస్వరాలు వస్తాయి. పాడుతుంటే తాళము తప్పిపోతుంది. తాళాన్ని అనుసరిస్తుంటే స్వరము తప్పిపోతుంది. నేర్చుకోటానికి ప్రయత్నిస్తారుగాని అది లభ్యము కాదు. ఇది భగవత్ప్రసాదము. కొంతమంది పుట్టినప్పుడే చిత్రకారులుగా పుడతారు, కొంతమంది గాయకులుగా తయారౌతారు. మరికొంతమంది నటులుగా తయారౌతారు. అంతా దైవప్రసాదం. ఇది మానవయత్నముతో లభించేదికాదు. అది కొంతవరకు మాత్రమే సహాయం చేస్తుంది. కానీ, యిదంతా దైవప్రసాదము. అందువలన దైవమును ముందు ఉంచుకోండి. ప్రపంచమును రెండవదిగా పెట్టుకోండి. మీ అహంకారాన్ని వెనుకకు నెట్టండి. ఇది నీ ఆనందమునకు రాజ మార్గము.

విద్యార్థులారా! పెద్దలను గౌరవించండి. ఈనాడు మనము పెద్దలను గౌరవించినప్పుడు రేపు మన పిల్లలు మనలను గౌరవిస్తారు. ఈనాడు నీవు నీమిత్రునికి ద్రోహం చేస్తే రేపు నీమిత్రుడు నీకు ద్రోహం చేయవచ్చు. ఈనాడు నీవు నీతల్లి తండ్రులను గౌరవిస్తే రేపటి దినమున నీ పిల్లలు నిన్ను గౌరవిస్తారు. భవిష్యత్తులో మంచి కావాలంటే వర్తమానంలో మంచిగా

srisathyasaivachanamrutam

జీవించండి. ప్రేమస్వరూపులారా! ప్రేమను పెంచుకోండి. ప్రేమనే దైవముగా విశ్వసించుకోండి. ప్రేమకు మీ జీవితాన్ని అంకితం చేయండి.

**(తేదీ.. 26-06-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam